www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 31 మే 2025
5
తిరుపతి

వేణుగోపాల కాలనీ పోరాట కమిటీ తీర్మానం

తిరుపతి శివజ్యోతినగర్ రోడ్డు మధ్యలో ఎల్లవలా పోతున్న 'తెలుగుగంగ'

స్వర్ణాంధ్ర... స్వచ్ఛాంధ్ర

తిరుపతి మధురానగర్‌లో ఉప్పెనలా పొంగుతున్న మురుగునీరు

ప్రతిరోజూ కమిషనర్ ఎన్.మౌర్య తెల్లవారుజామునే నిద్రలేచి అధికార యంత్రాంగంతో కలిసి తిరుపతి నగరంలో నాలుగైదు వార్డులన్నా కలియ తిరుగుతారు.. ఆదేశాలిస్తుంటారు. సమస్యలను పరిశీలిస్తుంటారు. వార్డు ప్రజలను పలకరిస్తుంటారు. కమిషనర్‌ను చూసిన ప్రజలు ఇకపై తమ వార్డులో సమస్య ఉండదేమో అనుకుంటారు.. అయితే ప్రతిరోజూ కమిషనర్ వార్డుల్లోకి రావడం మామూలే.. సమస్యలూ షరా మామూలే.. దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపని పర్యటనలు ఎందుకో మరి.. ప్రతి నెలా మూడో శనివారం జరిగే స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర పేరుకే ... సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు 'వాకింగ్' సందర్భంగా శుక్రవారం ఉదయం కనిపించిన సిత్రాలివి..

ఫొటోలు సేకరణ
వి.నాగరాజు,
సిపిఎం జిల్లా కార్యదర్శి

న్యాయ పోరాటం...నిరాశ్రయుల నిర్ణయం

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

'కోర్టుల్లో కేసు ఉందన్న విషయం చెప్పకుండా ఒకరు మాకు ప్లాట్లు అమ్మితే, మరొకరు జేసీబీలను తీసుకొచ్చి మా ఇళ్లను కూల్చేశారు.. ' కూలీనాలీ చేసి, చెమటోడ్చి కట్టుకున్న ప్రతి ఇటుక వెనుక మా కష్టం ఉంది.. మమ్మల్ని ఇలా నడివీధిలో వదిలేస్తే ఊరుకునేది లేదు' అంటూ వేణుగోపాల కాలనీ నిరాశ్రయులు స్పష్టం చేశారు. కూల్చిన చోటే ఇళ్లను తిరిగి నిర్మించుకుంటాం.. కూల్చిన వారిపై న్యాయపోరాటం చేస్తాం అంటూ సిపిఎం ఆధ్వర్యంలో ఏర్పాటైన 'వేణుగోపాల కాలనీ పోరాట కమిటీ' స్పష్టం చేసింది. శుక్రవారం ఇళ్లను తిరిగి నిర్మించుకోడానికి అవసరమైన ఇసుకను తెప్పించారు. కూల్చిన గోడల్లో ఏమైనా ఇటుకలు పనికి వస్తాయా అని వాటిని వెతికి ఓ చోట పేర్చుకున్నారు. తిరుమలనగర్ చెన్నాయిగుంట గ్రామ లెక్కదాఖలా సర్వే నంబర్ 218/1లోని ఎకరా 64 సెంట్ల భూమిలో తాము కొనుగోలు చేసిన ప్లాట్లను తిరిగి దక్కించుకోడానికి మూకుమ్మడిగా సిద్ధంగా ఉన్నామన్నారు. అఖిలపక్షం తమకు మద్దతుగా ఉందని, కూటమి ప్రభుత్వం స్పందించి ఇళ్లు కూల్చిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కోర్టులలో కేసులు నడుస్తున్నాయని, తమకు ఇళ్లను అమ్మిన వారు చెప్పలేదన్నారు. ఈ స్థలంకు సంబంధించి కోర్టులలో వ్యాజ్యాలు వేసి నడుపుతున్న మాజీ ఐఆర్ఎస్ అధికారి రాజన్ బాబు ఒక ఉన్నత స్థాయి అధికారిగా ప్రజలకు సేవ చేసిన ఆయన ఇంతటి కర్కసమైన చర్యకు దిగడం భావ్యం కాదన్నారు. కోర్టులలో కేసులు నడుస్తున్న సమయంలో స్థలాన్ని దక్కించుకోవడానికి ఇలాంటి దౌర్జన్యం చేస్తారని తాము ఊహించలేదన్నారు. ఇళ్లను కూల్చివేసిన తరువాత ఈ స్థలంకు సంబంధించి కోర్టులలో కేసులు నడుస్తున్నాయని తమకు విక్రయించిన వారు చెప్పడంతో రోడ్డున పడ్డామన్నారు. ఇప్పుడు తాము కోల్పోయిన లక్షలాది రూపాయల ఆస్తి నష్టానికి ఎక్కడికి వెళ్లి న్యాయం కోసం పోరాడాలో తెలియడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం తమకు జరిగిన అన్యాయం పట్ల పూర్తిస్థాయి విచారణ చేసి న్యాయం చేయాలని, తమనురోడ్డుపైన పడేసేలా చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు వాపోతున్నారు.

శ్రీసిటీలో ముగిసిన ఉచిత వేసవి శిబిరం

ప్రజాశక్తి - సత్యవేడు

శ్రీసిటీ వేసవి శిబిరం (సమ్మర్ క్యాంపు) తమకు విజ్ఞానం, వివిధ అంశాలలో నైపుణ్య శిక్షణతో పాటు వినోదం, ఆహ్లాదాన్ని పంచిందంటూ విద్యార్థులు పేర్కొన్నారు. గత నెల 9న శ్రీసిటీ నైపుణ్య శిక్షణా కేంద్రంలో ప్రారంభమైన వేసవి శిబిరం శుక్రవారంతో ముగిసింది. స్థానిక ఈఎంసి సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం ముగింపు కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవి శిబిరం పట్ల విద్యార్థులు తమ అభిప్రాయాలను, మధురానుభూతులను పంచుకున్నారు. తమ ప్రాంతంలో గతంలో ఇలాంటివి అందుబాటులో లేవని, ఉచిత భోజన, వాహన వసతితో పాటు చక్కని శిబిరం ఏర్పాటు చేసిన శ్రీసిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఏప్రిల్ 9 నుంచి మే 30 వరకు 40 రోజుల పాటు జరిగిన వేసవి శిబిరంలో 9, 10, 11వ తరగతుల పరీక్షలు పూర్తయిన విద్యార్థులు 175 మంది హాజరు కాగా, 50 మంది చివరివరకు పాల్గొన్నారు. శిక్షణలో స్పోకెన్ ఇంగ్లీష్, గణిత సూత్రాలు, బేసిక్ కంప్యూటర్ కోర్సు, వ్రాత నైపుణ్యాలు, పోటీ పరీక్షల మెళకువలు, జనరల్ నాలెడ్జి, ప్రపంచ వార్తలు తదితర అంశాలను బోధించారు. యోగా, కరాటే, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, మరికొన్ని క్రీడలలో తర్ఫీదు ఇచ్చారు. క్విజ్ పోటీలు, ఇంటరాక్టివ్ సెషన్‌లు నిర్వహించారు. ఫైర్ సేఫ్టీ, ప్రాథమిక ఆరోగ్య చికిత్సల పట్ల ప్రత్యక్ష అభ్యసన ద్వారా అవగాహన కల్పించారు. తిరుపతిలోని జంతు సంరక్షణ కేంద్రం, సైన్స్ సెంటర్ క్షేత్ర పర్యటనలు, శ్రీసిటీలోని పెప్సీ, వైటల్ పేపర్స్ పరిశ్రమలు, నర్సరీ సందర్శనలకు తీసుకెళ్లారు. స్థానిక శంకరనేత్రాలయ, కేర్ డెంటల్ వారిచే నేత్ర, పంటి వైద్య శిబిరాలను నిర్వహించి విద్యార్థులకు పరీక్షలు చేశారు. శ్రీసిటీ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి వివిధ కోర్సులతో ఈ కార్యక్రమాన్ని రూపొందించి మార్గనిర్దేశం చేశారు. వేసవి సెలవులను వధా చేయకుండా గ్రామీణ విద్యార్థులకు విజ్ఞానం, నైపుణ్య శిక్షణ అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన వేసవి శిబిరం విజయవంతం కావడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. మరిన్ని వినూత్న కోర్సులతో ఇకపై ప్రతిఏడాది వేసవి శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు.

అధ్యాపక బందం రంజిత (క్రాఫ్ట్), దుష్యంత్ (పోటీ పరీక్షలు), ఉమా, నేహా (వ్యక్తిత్వ అభివద్ధి), సాయి లక్ష్మి (ఇంగ్లీష్), సౌమ్య (కంప్యూటర్లు), కోదండం (యోగా, కరాటే), క్రీడా సెషన్లకు మ్యాజిక్ బస్ ఫౌండేషన్ నిపుణులు వేసవి శిబిరం శిక్షకులుగా వ్యవహరించారు. ముగింపు వేడుకలలో విద్యార్థులు ఆటపాటలు, వివిధ సాంస్కతిక కార్యక్రమాలతో అలరించారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్, శ్రీరామచంద్ర మెడికల్ సెంటర్ డాక్టర్ సులోచన, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి 'టోల్' వసూళ్లు ప్రారంభం

ప్రజాశక్తి-ఏర్పేడు

పూత్తలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారి నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఏర్పేడు మండలం లోని మేర్లపాక సమీపంలో నిర్మించిన టోల్ ప్లాజా వద్ద టోల్ వసూళ్లు శనివారం నుంచి ప్రారంభం కానుంది. మూడు రోజుల క్రితం నుండి ట్రైల్స్ జరుగుతున్నాయి. కారుకు రూ. 140, బస్సు, ట్రక్కులకు రూ. 470 చొప్పున తీసుకోనున్నారు. టోల్ గేట్‌కు రెండువైపులా 20 కిలోమీటర్ల లోపు ఉన్న వైట్ బోర్డు వాహనదారులు నెలకు రూ. 350 చెల్లించి పాస్ తీసుకోవాలని టోల్ ప్లాజా యాజమాన్యం పేర్కొంది.

మురుగుకాలవల్లో చెత్త తొలగించండి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మురుగుకాల్వల్లో ఎక్కడా చెత్తలేకుండా తొలగించాలని కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. శుక్రవారం నగరంలో ఎన్‌జీఓ కాలనీ, కపిలతీర్థం రోడ్డు, ప్రకాశం పార్క్ రోడ్డు, కె.టి.రోడ్డు తదితర ప్రాంతాల్లో అధికారులతో కలసి పారిశుధ్య పనులను పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో చెత్త కుప్పలు ఉండడంతో సిబ్బందిని మందలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఉదయాన్నే ప్రధాన రహదారుల్లో ముందుగా చెత్త కుప్పలు తొలగించాలని అన్నారు. త్వరలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. కాబట్టి మురుగునీటి కాలువల్లో ఎక్కడా చెత్త లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఇళ్లల్లోని చెత్తను తమ కాలువల్లో వేయకుండా మీ ఇంటి వద్దకు వచ్చే సిబ్బందికి అందజేయాలని ప్రజలకు సూచించారు. కమిషనర్ వెంట తుడా ఈ.ఈ. రవీంద్ర రెడ్డి, నగరపాలక సంస్థ డి.ఈ. వెంకట ప్రసాద్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య , తదితరులు ఉన్నారు.

వర్షాలపై యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నైరుతి రుతుపవనాలు ముందుగా వస్తున్నందున విరివిగా వర్షాలు కురిసే అవకాశాలు ఉంటాయని, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు అధికారులకు దిశా నిర్దేశం చేసారు. కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరాలలో ఎదురైన అనుభవాలను దష్టిలో ఉంచుకొని, ఈసారి మరింత సమగ్రంగా, పటిష్టంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. విపత్తుల నిర్వహణ సంస్థ జారీ చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపి) ప్రకారం కార్యాచరణను రూపొందించుకొని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి, వాటి ఫోన్ నంబర్లను, టోల్ ఫ్రీ నెంబర్ ను ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. నదీ పరీవాహక ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ముంపు ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట తిరుపతి ఆర్డీవోలు భాను ప్రకాష్ రెడ్డి, కిరణ్మయి, రాంమోహన్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య, డిపిఓ సుశీలా దేవి పాల్గొన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న సి.దివాకర్‌రెడ్డి

శెట్టిపల్లి భూముల సమస్యకు త్వరలోనే పరిష్కారం

తుడా ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి వెల్లడి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'శెట్టిపల్లి.భూముల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం' అని తుడా ఛైర్మన్ సి.దివాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం శెట్టిపల్లి భూములను ఛైర్మన్ సి.దివాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య, తుడా, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న శెట్టిపల్లి భూముల పరిష్కారానికి అన్ని చర్యలు చేపడుతున్నామని అన్నారు. 10 సంవత్సరాలుగా రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. రైతులకు , సైట్లు కొనుగోలు చేసిన వారికి ఎక్కడ ఇవ్వాలనే విషయాలపై చర్చిస్తున్నామని అన్నారు. చిన్న చిన్న సమస్యలు ఉంటే సర్దుకుని ముందుకు వెళ్లేందుకు సహకరించాలని అన్నారు. వేల కుటుంబాలు ఆధారపడి ఉన్న శెట్టిపల్లి భూములను అభివృద్ధి చేస్తామని అన్నారు. ప్రభుత్వం తరపున ఈ భూములను అభివృద్ధి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామని అన్నారు. రాబోయే రోజుల్లో త్వరగా రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పించి, మహా నగరంగా తీర్చిదిద్దనున్నామని అన్నారు. తుడా తరపున ఇంత త్వరగా అభివృద్ధి చేశారా అనేలా చేస్తామని అన్నారు.పరిశీలనలో తుడా సూపరింటెండెంట్ ఇంజినీర్ కష్ణారెడ్డి, ఈ.ఈ. రవీంద్ర, ప్లానింగ్ ఆఫీసర్ దేవికుమారి, తహసీల్దార్ భాగ్యలక్ష్మి , ఉద్యానవన శాఖాధికారి మాలతి, సర్వేయర్లు దేవానంద్, కోటేశ్వర రావు ఉన్నారు.

'షార్'లో 'యువిక' ముగింపు

ప్రజాశక్తి- సూళ్లూరుపేట

'యువిక-2025' కార్యక్రమాన్ని ఏడు ఇస్రో కేంద్రాలలో ఈ నెల 19 నుంచి 30 వరకు నిర్వహించారు. శుక్రవారం యువిక-2025 ముగింపు వేడుకల కార్యక్రమం శ్రీహరికోట బ్రహ్మప్రకాష్ ఆడిటోరియంలో నిర్వహించారు. షార్‌తో పాటు ఏడు ఇస్రో కేంద్రాలలో, వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమంలో ఇస్రో ఛైర్మన్ డా. వి.నారాయణన్ మాట్లాడుతూ ఈ రెండు వారాల యువిక-2025 కార్యక్రమం విజయవంతంగా పాల్గొన్న విద్యార్థులను అభినందిచారు. అనంతరం షార్ డైరెక్టర్ ఏ.రాజరాజన్ విద్యార్థులు అడిగిన ఎన్నో ప్రశ్నలకు విశ్లేషిస్తూ వివరణ ఇచ్చారు. షార్ డైరెక్టర్ ఏ.రాజరాజన్ అభ్యర్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు.

ప్రజాసేవ సంతృప్తినిచ్చింది : బీగాల రామ్మూర్తి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ

'మూడు దశాబ్దాల పాటు శ్రీవారి సేవ, ప్రజా సేవ చేయటం సంతృప్తి నిచ్చింది' అని టిటిడి వాటర్ వర్క్ డిపార్ట్మెంట్ మెకానిక్ బీగాల రామ్మూర్తి తెలిపారు. 1988లో టిటిడిలో దాదాపు 800 మందిని నిలిపివేస్తే సిఐటియు జాతీయ నాయకులు నండూరి ప్రసాద్‌రావు సహకారంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పెద్దఎత్తున ఉద్యమాల్లో పాల్గొన్నారు. సిఐటియు యూనియన్ క్రమశిక్షణ నేర్పింది. ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న ఆయన 'ప్రజాశక్తి'తో ఆయన జీవిత విశేషాలు, స్వామి సన్నిధిలో ఆయన చేసిన సేవలను వివరించారు. మా సొంతూరు పాకాల మండలం కావిరెడ్డిగారిపల్లి. మునమ్మ, వెంకటస్వామి దంపతులకు 1966లో తొలి సంతానంగా జన్మించాను. మా తండ్రి వెంకటస్వామి కూలి పని చేసుకుంటూ ముగ్గురు పిల్లలను క్రమశిక్షణతో, మానవీయ విలువలతో, సేవా దక్పదాన్ని పెంపొందించి పెంచారు. 1983లో అవుట్‌సోర్సింగ్‌గా (కాంట్రాక్టర్ ఉద్యోగ) తిరుమలలో విధులు నిర్వహించాను. 1985లో టైం స్కేలుగా చేశాను. 1991 పర్మినెంట్ ఎంప్లాయిగా టిటిడిలో విధులు నిర్వహించాను. 1996 వాటర్ విభాగంలో అసిస్టెంట్ ఫిట్టర్ గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం స్విమ్స్ లో వాటర్ వర్క్ డిపార్ట్మెంట్లో మెకానిక్ గా ఉద్యోగ విరమణ పొందుతున్నాను. సతీమణి మునిలక్ష్మి, కుమారుడు ప్రసాద్ సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నారు.కుమార్తె వాణి, అల్లుడు కూడా సాఫ్ట్‌వేర్‌లోనే రాణిస్తున్నారు. 34 ఏళ్లపాటు శ్రీవారి సేవ చేసి ఉద్యోగ విరమణ పొందుతున్నాను.

శ్రీవారి సేవలో డిజిపి హరీష్ కుమార్ గుప్తా

తిరుపతిలో ఘనంగా 'వైట్ గోల్డ్'షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

బంగారాన్ని నగదు రూపంలోకి మార్చుకోవాలనుకునే వారు వైట్ గోల్డ్ సంస్థను సంప్రదించాలని సంస్థ సేల్స్ హెడ్ మిథున్ శెట్టి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో మూడవ షోరూమ్ ను తిరుపతి లో ప్రారంభించారు.. తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డు లోని స్మార్ట్ బజార్ ఎదురుగా వైట్ గోల్డ్ సంస్థ కార్యాలయంను శుక్రవారం స్థానిక శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసు ప్రారంభించారు. సంస్థ ప్రతినిధులు ఎమ్మెల్యే కి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అవసరాల కోసం గోల్డ్ లోన్ సంస్థలు చాలా ఉపయోగంగా ఉన్నాయని తెలియజేశారు. ప్రజలు కూడా వైట్ గోల్డ్ సంస్థలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంస్థ సేల్స్ హెడ్ మిథున్ శెట్టి, సేల్స్ మేనేజర్ సల్మా లు మాట్లాడుతూ పాత, వాడకానికి లేని బంగారు ఆభరణాలను కొనుగోలు చేయడంలో వైట్ గోల్డ్ నిపుణత కలిగిన సంస్థ అని తెలిపారు. కేవలం 30 నిమిషాల్లోనే ప్రక్రియ పూర్తి చేసి తక్షణమే నగదును అందిస్తుందన్నారు. 2017 లో బెంగుళూరులో ప్రారంభమైన వైట్ గోల్డ్ సంస్థ అంచెలంచెలుగా విస్తతం చేస్తున్నామన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు విజయవాడ, గుంటూరు, తిరుపతి నగరాల్లో షోరూమ్‌లను ప్రారంబించామన్నారు.



ఎస్వీ మ్యూజియంలో టీటీడీ ఛైర్మన్ తనిఖీలు

ప్రజాశక్తి - తిరుమల

తిరుమలలో ఎస్వీ మ్యూజియం ఆధునీకరణ పనులను టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్.నాయుడు, బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి తో కలిసి శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు.టీసీఎస్ సంస్థ సిఎస్ఆర్ కింద రూపొందిస్తున్న గ్యాలరీలను ఆయన పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. తిరుమల క్షేత్ర చరిత్ర, వైభవం, పురాణాల విశిష్టత ప్రతిబింబించేలా, భక్తులకు ఆధ్యాత్మిక జ్ఞానం అందించేలా మ్యూజియాన్ని అభివద్ధి చేసి పూర్తిస్థాయిలో భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఛైర్మన్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ఆరోగ్య శాఖ, ఇంచార్జ్ చీఫ్ మ్యూజియం ఆఫీసర్ సోమన్నారాయణ, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, ఏవిఎస్వో విశ్వనాథ్, మ్యూజియం క్యూరేటర్ శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీబీసీ అభివద్ధిపై సమీక్ష

శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్లో ప్రసారమౌతున్న కార్యక్రమాల నాణ్యత, అభివృద్ధిపై శుక్రవారం తిరుమలలోని అన్నమయ్య భవన్ లో టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్.నాయుడు, ఈవో జె.శ్యామలరావు సంయుక్తంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. టీటీడీ ఛైర్మన్ మాట్లాడుతూ ఎస్వీబీసీలో శ్రీవారి భక్తులను ఆకట్టుకునే విధంగా కార్యక్రమాలకు రూప కల్పన చేయాలని, తద్వారా వీక్షకుల సంఖ్య పెంచ వచ్చునని తెలిపారు.ఈవో మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నాణ్యమైన ప్రమాణాలతో రూపొందించడంతో పాటు యువతకు చేరువయ్యేలా కార్యక్రమాలు ప్రసారం చేయాలని తెలియజేశారు. అంతకు మునుపు సాంకేతిక కంటెంట్ నిపుణులు శ్రీనివాసరెడ్డి, రవి కుమార్, శ్రీనివాస్ ఎస్వీబీసీ కార్యక్రమాల ప్రమాణాలను మరింత ఆకర్షణీయంగా తీర్చి దిద్దేలా పలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, జేఈఓ, సీఈఓ ఎస్వీబీసీ ఇంచార్జి వీరబ్రహ్మం, ఎస్వీబీసీ ఓఎస్డీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో వాటర్ ట్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఇందిరా ప్రియదర్శినీ కూరగాయల మార్కెట్ లో వాటర్ ట్యాంక్ లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. మార్కెట్ లో మౌళిక సదుపాయాలను మరింత మెరుగుపరుస్తామని ఆయన చెప్పారు. శుక్రవారం సాయంత్రం కూరగాయాల మార్కెట్ లో కాంట్రాక్టర్ అన్నారెడ్డి యువరాజ్ రెడ్డి ఏర్పాటు చేసిన రెండు వాటర్ ట్యాంక్ లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. మార్కెట్ కు వచ్చే వారికి ముఖ్యంగా రైతులకు, కూలీలకు, కొనుగోలుదారులకు తాగునీటి సమస్య వాటర్ ట్యాంకుల ఏర్పాటుతో పరిష్కారమైందని చెప్పారు. మార్కెట్ లో స్ట్రీట్ లైట్స్, టాయిలెట్స్ ను ఏర్పాటు వీలైనంత త్వరగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. రోడ్డుపై వ్యాపారం సాగిస్తున్న చిరువ్యాపారులకు షెడ్స్ ఏర్పాటు చేసే అంశం కార్పోరేషన్ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు. వ్యాపారం ఎలా సాగుతోంది, కూరగాయల ధరలు ఏవిధంగా ఉన్నాయని వ్యాపారస్థులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ ఎస్ కే బాబు, అన్నారెడ్డి కష్ణారెడ్డి, జానకిరామి రెడ్డి, దొరైరాజ్, రాజా రెడ్డి పాల్గొన్నారు.

రేణిగుంట పురవీధుల్లో సమైక్యతా ర్యాలీ

ఉగ్రవాదం, మతోన్మాదం నశించాలి

వామపక్ష లౌకికవాదుల సమైక్యతా ర్యాలీ

ప్రజాశక్తి -రేణిగుంట

'ఉగ్రవాదం - మతోన్మాదం నశించాలి... మతసామరస్యం - దేశ సమైక్యత వర్ధిల్లాలి' అంటూ వామపక్ష లౌకికవాదులు హిందూ ముస్లింలు ఐక్యంగా సిపిఎం ఆధ్వర్యంలో సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రఫీవుల్లా మాట్లాడుతూ దేశ సమైక్యతకోసం, మత సామరస్యం కోసం హిందూ ముస్లిం క్రైస్తవులు ఐక్యత కోసం పనిచేస్తున్నది కమ్యూనిస్టులేనని అన్నారు. దేశంలో ఉగ్రవాదం, మతోన్మాదం ప్రమాదకరమైనవని, సమిష్టిగా ఎదుర్కోవాలన్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టే బిజెపిని తిప్పికొట్టాలన్నారు. సిపిఎం నాయకులు ఒ.వెంకటరమణ, కొండ్రెడ్డి హరినాథ్ మాట్లాడుతూ పహల్గాం ఘటనలో 26 మంది చనిపోయారని, గాయపడిన వారిని కాపాడిన వారిలో హిందూ ముస్లింలూ ఉన్నారన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదులను అంతం చేయడానికి 'సింధూర్ ఆపరేషన్'ను సైనికులు ప్రాణాలకు వెనుకాడకుండా చేస్తుంటే, పాకిస్తాన్, ఇండియా మధ్య యుద్ధం విరమణ ఒప్పందాన్ని తానే చేసినట్లు అమెరికా అధ్యక్షులు ట్రంప్ ప్రకటించడం ఏంటని ప్రశ్నించారు. మన దేశ సార్వభౌమాధికారం అమెరికా చేతుల్లోపెట్టడం ఏంటన్నారు. ఈ కార్యక్రమంలోసెల్వరాజ్, ఈశ్వరమ్మ, సహజ, యోగేష్, ఇస్మాయిల్, సాదిక్‌బాష; షేక్ బాష, షాజహాన్, ఖాదర్‌బాష పాల్గొన్నారు.

ప్రకృతి ఆరాధన భారతీయ గొప్పతనం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

'ప్రకృతి ఆరాధన భారతీయ సంస్కృతి గొప్పతనం, రాబోయే తరాలకు ప్రకృతి ప్రేమను నేర్పవలసిన అవశ్యకత ఉంది' అని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ వి కుమార్ తెలిపారు. వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ గ్రీన్ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత బివి రమణ సన్మాన సభను శుక్రవారం నిర్వహించారు. వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగర్జున అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ ఆర్ వి కుమార్ మాట్లాడుతూ బివి రమణ సీనియర్ జర్నలిస్టుగా, ప్రకృతి ప్రేమికుడిగా, రచయితగా బహుముహ ప్రజ్ఞసాలి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీమన్నారాయణ, నెమలేటి కిట్టన్న, ఎం. గంగాధర ప్రసాద్, సాయి లక్ష్మి, సాకం నాగరాజు, భూమన్, టెంకాయలు దామోదరం, నడ్డ నారాయణ పాల్గొన్నారు.

బివిరమణను సత్కరిస్తున్న దృశ్యం

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: స్థానిక పుత్తూరు పురపాలక సంఘం, సమావేశ మందిరంలో శనివారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నామని పురపాలక సంఘ కమిషనర్ మంజునాథ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశం మున్సిపల్ చైర్మన్ హరి అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, వార్డు సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు సమావేశానికి తప్పక హాజరుకావాలని తెలిపారు.

విద్యా కేంద్రం ఏర్పాటుకు స్థలం పరిశీలన

విద్యా కేంద్రం ఏర్పాటు పరిశీలనలో అధికారులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అడిషనల్ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు, పుత్తూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సహిత విద్యా కేంద్రం ఏర్పాటుకు, జిల్లా సహిత విద్యా సమన్వయకర్త చంద్రశేఖర్ రెడ్డి మండల పరిషత్ కార్యాలయ అధికారులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు బోధన అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. ఈ మేరకు ఎంఈఓ తిరుమల రాజు, బాలసుబ్రమణ్యం, పాఠశాల హెచ్ఎం భువనేశ్వరితో చర్చించారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయులు ఆనంద్, సూర్య కుమారి, హేమలత పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త మృతికి నివాళి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం, నీరువాయి గ్రామంలో బ్రైన్ స్ట్రోక్‌తో గురువారం రాత్రి మృతి చెందిన టిడిపి కార్యకర్త దొరై మృతికి శుక్రవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవ రెడ్డి, నాగరాజు, ఢిల్లి, ఏకాంబరం, మోహన్ బద్దు, రుకేష్, సుగంధర్, రాజశేఖర్, రమేష్, నాగేంద్రబాబు, గవాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీలకు వీధిలైట్లు పంపిణీ

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: తిరుపతి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మద్దెల గురుమూర్తి నిధులతో వరదయ్యపాలెం మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు రెండు విడతల్లో రూ 21 .20 లక్షలతో వీధిలైట్లు పంపిణీ చేసినట్లు వైసిపి పార్టీ మండల అధ్యక్షులు నాయుడు దయాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్‌లకు లైట్లను పంపిణీ చేయడం జరిగింది. సర్పంచుల విన్నపం మేరకు స్పందించిన ఎంపీ గురుమూర్తికి మండల పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్ఆర్‌సిపి అధికార ప్రతినిధి చిన్న, రాష్ట్ర చేనేత కార్మిక విభాగం సభ్యులు బాబు, తిలక్ బాబు, సర్పంచ్ దుడ్డు వేణు, నియోజకవర్గ యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, సేవాదళ్ కన్వీనర్ నాని రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సునీల్, నాయకులు మురళి రెడ్డి రమేష్, రిపు వర్ధన్, కాంట్రాక్టర్ రమణ తదితరులు ఉన్నారు.

వైసిపి నూతన కార్యవర్గం ఎన్నిక

సభ్యులను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండల నూతన కార్యవర్గ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో ఏర్పేడు వైఎస్సార్ పార్టీ మండల అధ్యక్షులు కూనాటి రమణయ్య యాదవ్, ఉపాధ్యక్షులు రాజారెడ్డి, ముని కృష్ణారెడ్డి, ఇతర కార్యవర్గ కమిటీ సభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి ఉన్నారు. వైసిపి బలోపేతానికి కష్టపడి పనిచేస్తామని, ప్రజా సమస్యలపై పోరాడతామని నూతన కమిటీ సభ్యులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శివ, మోహన్ రెడ్డి, నారాయణ, లోకనాథం రెడ్డి, భాస్కర్ రెడ్డి, వేణు, ముని కృష్ణారెడ్డి, గాలి నాయుడు, జల్లి ప్రసాద్, చంగల్ రాయలు, గోవర్ధన్ రెడ్డి, పెరుమాళ్, సీతారామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సివిల్ రైట్స్ డే

ప్రజాశక్తి - తడ : తడ మండలం, కాదలూరు పంచాయతీ, ఎస్సీ కాలనీలో శుక్రవారం సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శరత్ బాబు మాట్లాడుతూ సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో గ్రామ సమస్యలు అధికారులకు తెలియపరిచి పరిష్కరించుకోవాలని తెలియజేశారు. త్రాగునీరు, డ్రైనేజీ సమస్య, పక్కా గృహాలు, పోలీస్ స్టేషన్ సమస్యలు వంటి సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. కొత్త రేషన్ కార్డులు, రేషన్ కార్డులో మార్పులు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి నెల ఇంటింటికి వచ్చి ఇచ్చే రేషన్ బియ్యం, వచ్చే నెల నుండి రేషన్ షాప్ వద్దకే వెళ్లి తీసుకోవాలని, ఆరోగ్యం సరిలేక మంచం మీద ఉన్నవారికి, 65 సంవత్సరాల పైబడిన వాళ్లకు, వికలాంగులకు, రేషన్ డీలర్ ఇంటి వద్దకు వచ్చి రేషన్ అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తడ మండలంలోని అన్ని శాఖల అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దతు ఇవ్వండి : ఆలయ ఉచిత సేవకులు

కాంగ్రెస్ నాయకుడికి మద్దతు కోరుతున్న ఆలయ సేవకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో 2014 నుంచి ఉచిత సేవకులుగా పనిచేస్తున్న 12 మందికి జీతాలు ఇవ్వకుండా ఆలయ అధికారులు అన్యాయం చేస్తున్నారంటూ వారు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బత్తయ్య నాయుడుకు విన్నవించారు. న్యాయపోరాటం చేస్తున్న తమకు అండగా నిలవాలని కోరారు. గత ట్రస్ట్ బోర్డు 12 మంది ఉచిత సేవకులకు వేతనాలు ఇవ్వాలని దేవాదాయ శాఖకు విన్నవించడంతో, అందుకు ఆమోదం తెలుపుతూ కమిషనర్ జీవో జారీ చేశారని గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమను పక్కనపెట్టి కొత్తవారిని విధుల్లోకి తీసుకున్నారని వాపోయారు.

రోహిణి సింధూరి జన్మదిన వేడుకలు

జన్మదిన సందర్భంగా పేదలకు వస్త్ర దానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, సంగం థియేటర్ కూడలి వద్ద రోహిణి సింధూరి జన్మ దిన వేడుకలను కంకణాల పెంచల్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు చీరలు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీగౌరి, గుబ్బ నరసింహులు పాల్గొన్నారు.

పాండురాజుల కుంట కబ్జా

పట్టించుకోని రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - రామచంద్రాపురం: మండలంలోని నెత్త కుప్పం రెవిన్యూ, గ్రామానికి చెందిన పార్వతీపురంలో అతి పురాతనమైన పాండురాజుల కుంట కబ్జాకు గురయింది. అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని పార్వతిపురం గ్రామానికి చెందిన ఎం.రాజశేఖర్ నాయుడు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెత్తకుప్పం గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా, సర్వే నెంబర్ 188లో సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో కుంట ఉండేది. క్రమేణ ఆకుంట కబ్జాలకు గురవడంతో కుంట విస్తీర్ణం తగ్గిపోయింది. ఉన్న విస్తీర్ణాన్ని కూడా నెత్త కుప్పం గ్రామానికి చెందిన అధికార పార్టీకి చెందిన ఒక చోటా నాయకుడు దర్జాగా కబ్జా చేశాడు. ట్రాక్టర్ల ద్వారా ఎర్ర మట్టిని తోలించి, కుంటను పూడ్చివేసి, కాశిరాయి స్తంభాలను నాటి ఇనుప కంచె ఏర్పాటు చేయించాడు. ఆ స్థలంలో వెంకటముని, సోమశేఖర్ ఇరువురు షెడ్ల నిర్మాణానికి ప్రయత్నించగా స్థానిక విఆర్ఓ బాబు, వీఆర్ఏ గీతా అడ్డుకున్నారు. కానీ ఆ చోటా నాయకుడు రాజకీయ బలంతో అధికారులను నిర్మాణాలను అడ్డుకుంటే మీ కథ చూస్తామంటూ బెదిరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ కుంట కబ్జా వ్యవహారాన్ని స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టి కూడా తీసుకెళ్లినట్లు నాదెండ్ల రాజశేఖర్ నాయుడు తెలిపారు. రెవెన్యూ అధికారులు వెంటనే కుంటను సర్వే చేసి ఆక్రమణలను తొలగించాలని పార్వతీపురం గ్రామస్తులు కోరుతున్నారు. రెవెన్యూ అధికారులు ఆ చోట నాయకుడి బెదిరింపులకు భయపడి, ఆక్రమణలు తొలగించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

సర్వే చేసి ఆక్రమణలు తొలగిస్తాం

నెత్తకుప్పం రెవిన్యూ, పార్వతీపురం సమీపంలో ఉన్న కుంట పరంబోకు స్థలాన్ని కొంతమంది కబ్జాకు పాల్పడుతున్నట్లు నా దృష్టికి వచ్చింది. వెంటనే వీఆర్వో ద్వారా అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నాం. సర్వే చేసి ఆక్రమణలు తొలగించి కుంట స్థలాన్ని కాపాడుతాం. - కె.వెంకటరమణ, తహశీల్దార్, ఆర్.సి.పురం

మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరిస్తాం

సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తదితరులు

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పురపాలక కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గత ప్రభుత్వంలో పట్టణంలో అభివృద్ధి కుంటుపడిందని కోఆప్షన్ సభ్యుడు సునీల్ రెడ్డి ప్రస్తావించగా, మున్సిపాలిటీ ఏర్పడి వైసిపి ప్రభుత్వంలోనే పట్టణంలో పూర్తి అభివృద్ధి జరిగిందని కావాలంటే అభివృద్ధిని కళ్ళకు కట్టినట్టు లెక్కలతో చూపిస్తామని కౌన్సిలర్ మీజూరు రామకృష్ణారెడ్డి ఖండించారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి పనులను అజెండాలో పొందుపరిచామని టెండర్లు వేసిన కాంట్రాక్టర్లు వెళ్లిపోవడంతో పనులు ఆగిపోయాయని, దీనిని అందరు గుర్తించాలని శ్రీమంత్ రెడ్డి వెల్లడించారు. మున్సిపల్ కౌన్సిల్ ఇక 5 నెలలు మాత్రమే ఉందని ఇప్పటికీ కొన్ని వార్డులలో పూర్తిగా అభివృద్ధి పనులు జరగలేదని కొందరు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా డ్రైనేజీలు, సిసి రోడ్లు వేసి కౌన్సిల్ పూర్తయ్యే లోపు అభివృద్ధి చేసి ప్రజలు మన్ననలు పొందాలని మరికొందరు కోరారు. పట్టణంలో పలుచోట్ల వీధిలైట్లు వెలగడం లేదని, దోమల బెడద ఎక్కువగా ఉందని కమిషనర్ చిన్నయ్యకు కౌన్సిలర్లు విన్నవించారు. ప్రతి వార్డులో ప్రజల సమస్యల వివరాలను అడిగి తెలుసుకోవడం జరిగిందని, త్వరలోనే అభివృద్ధి పనులు చేపడతామని సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ హామీ ఇచ్చారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇక్కడ సమస్యలు వివరించి రెండు కోట్ల రూపాయలు అభివృద్ధి పనులకు తీసుకువచ్చామని, త్వరలోనే వాటి పనులు మొదలు పెడతామని ఆమె అన్నారు. ప్రస్తుత కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు విన్నవించిన సమస్యలు రాసుకోవడం జరిగిందని వాటిల్లో ప్రధానమైన సమస్యలు త్వరగా పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని ఎమ్మెల్యే విజయశ్రీ తెలిపారు.

ప్రాణం కాపాడటంలో రక్తదానమే కీలకం

ప్రజాశక్తి - రామచంద్రాపురం: ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిండు ప్రాణాన్ని కాపాడటంలో రక్తదానమే కీలకపాత్ర పోషిస్తుందని ఎన్సిసి గ్రూప్ కమాండెంట్ కెప్టెన్ రాజగోపాల్ జగదీష్ ఆత్రే పేర్కొన్నారు. రామచంద్రాపురం మండలం సి.రామాపురం, వెరిటాస్ సైనిక పాఠశాల ఆవరణలో 11 ఎయిర్ స్క్వాడ్రన్ (టెక్నికల్) ఎన్‌సీసీ తిరుపతి గ్రూప్ ప్రధాన కార్యాలయాల ఆధ్వర్యంలో కంబైన్డ్ వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం రుయా ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ డాక్టర్ హరిత ఆధ్వర్యంలో జరిగింది. ఎన్‌సిసి కేడెట్స్ రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి గ్రూప్ కమాండెంట్ శిక్షణ అధికారి రాజశేఖర్, శ్రీనివాసులు, కార్యాలయ పర్యవేక్షకులు సురేష్ కుమార్, ఎన్‌సిసి క్యాంపు పర్యవేక్షకులు గుణశేఖర్, ఏఎన్ఓ లు, తిరుపతి రుయా ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ నర్స్ గోవిందమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ రఘు, టీం సభ్యులు పాల్గొన్నారు.

సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్ 'షైన్స్' విడుదల

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రముఖ ఆహార విభాగ ఉత్పత్తుల సంస్థ ఐటీసీ సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్, తమ మామ్స్ మ్యాజిక్ షైన్స్ షైనీ బటర్ (వెన్న) కుకీని విడుదల చేసినట్లు ఐటీసీ లిమిటెడ్ బిస్కెట్స్ అండ్ కేక్స్ క్లస్టర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అలీ హారిస్ షేర్ తెలిపారు. ఇది బటర్ కుకీ ప్రియులకు ఆనందకరమైన కొత్త అనుభవాన్ని అందిస్తుందన్నారు. ఒక తల్లి తన బిడ్డలో ప్రతిభను బయటకు తీసుకువచ్చినట్లే, ఈ కరకరలాడే, వెన్నతో కూడిన కుకీని సున్నితమైన చక్కెర గ్లేజింగ్ ద్వారా ప్రత్యేకంగా తయారు చేశారని తెలిపారు. దీని కోసం, మామ్స్ మ్యాజిక్ నదియా మొయిదుతో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన కొత్త టీవీసీని విడుదల చేశామని తెలిపారు. ఈ కుకీలు సంతృప్తికరమైన రుచిని అందిస్తాయన్నారు. ఇది పగటిపూట తినడానికి, టీ-టైమ్ క్షణాలను ఆస్వాదించటానికి సరైన అనుబంధంగా మారుస్తుందన్నారు.

రెండు రోజులు ముందుగానే పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - రామచంద్రపురం : రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల నగదును రెండు రోజులు ముందుగానే లబ్ధిదారులకు పంపిణీ చేసేలా ఆదేశాలు ఇచ్చిందని ఎంపీడీవో ఇందిర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్య అతిథిగా హాజరై, పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు రామచంద్రాపురం ఎస్సీ కాలనీలో లబ్ధిదారులకు పింఛన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో సంఘమిత్ర మృతి



ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలంలో సంఘమిత్రగా విధులు నిర్వహిస్తున్న దాము శుక్రవారం బ్రైన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. ఆయన వెలుగు డ్వాక్రా గ్రూపుల్లో 2001 నుండి పనిచేశారు. మండలంలో మొట్టమొదట డ్వాక్రా గ్రూపులు చేర్చడంలో డ్వాక్రా సిబ్బందితో పాటు కీలక పాత్ర పోషించారు. దాము మృతి పట్ల డ్వాక్రా సంఘాల, పొదుపు సంఘాల మహిళలు నివాళి అర్పించారు.

ఆవిర్భావ మహోత్సవానికి తరలిరండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో నియోజకవర్గాలలో పర్యటించి జిల్లా కమిటీలను ఏర్పాటు చేసి తద్వారా త్వరలోనే రాష్ట్ర కమిటీని బలోపేతం చేయనున్న తరుణంలో, తిరుపతి జిల్లాలోఉన్న బ్రాహ్మణ సంఘాలను అన్నిటిని కలుపుతూ తిరుపతి జిల్లా బ్రాహ్మణ సంఘం ఆవిర్భావ మహోత్సవానికి శ్రీకారం చుట్టినట్లు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య, రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు వేదం హరిప్రసాద్, పుత్తూరు నియోజక సమన్వయ కర్త బాలాజీ శర్మ తెలిపారు. ఆదివారం శ్రీకాళహస్తిలో బ్రాహ్మణ సమ్మేళనం నిర్వహించి, అందులో జిల్లాలోని వివిధ బ్రాహ్మణ సంఘాల అధ్యక్షులను, కార్యవర్గాన్ని పరిచయం చేయనున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సింగరాజు ప్రకాశం శాస్త్రి, కొత్తపల్లి అజయ్ కుమార్, డాక్టర్ చక్రవర్తి రాఘవన్, బాబు స్వామి, ఆలూరు రామకృష్ణల సమక్షంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం జరిగినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి వాసుదేవరావు హాజరవుతారని తెలిపారు.

సమిష్టి కృషితో మహానాడు విజయవంతం

విలేకరుల సమావేశంలో నరసింహ యాదవ్, ఆర్.సి.ముని కృష్ణ తదితరులు

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): రాష్ట్రవ్యాప్త టీడీపీ క్యాడర్ సమిష్టి కృషితో కడపలో నిర్వహించిన మహానాడు విజయవంతం అయ్యిందని టిడిపి తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు గొల్ల నరసింహ యాదవ్ తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాబోయే రోజుల్లో మరింత వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి, టీడీపీకి పునాది అయిన కార్యకర్తల సంక్షేమానికి మహానాడులో పలు తీర్మానాలను ఆమోదం చేశామన్నారు. వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి కడప స్టీల్ ప్లాంట్ పనులు వేగవంతం చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. 2027 డిసెంబర్ నాటికి పోలవరాన్ని పూర్తి చేస్తామని, ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో అమరావతి రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. యువగళం పాదయాత్రలో రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం చేసే విధంగా కార్యాచరణకు ఆమోదం తెలిపామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సి మురికి కృష్ణ, యశ్వంత్, సుబ్బు యాదవ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం విజేత ఏఎం పుత్తూరు

మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో విజేతలుగా నిలచిన ఏఎం పుత్తూరు మహిళా సంఘం సభ్యులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి మధ్యాహ్న భోజన పథకం పోటీల్లో శ్రీకాళహస్తి పట్టణం ఏఎం పుత్తూరుకు చెందిన మహిళా సంఘం మధ్యాహ్న భోజన నిర్వాహకులు విజేతలుగా నిలిచారు. విజయవాడలో శుక్రవారం మధ్యాహ్న భోజనం పథకం మెనూ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు తిరుపతి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ఏఎంపుత్తూరు మహిళా సంఘం మధ్యాహ్న భోజన నిర్వాహకులు సుజాత, రాములమ్మ ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. గత ఏడాది కూడా ఏఎంపుత్తూరు మహిళా సంఘం మధ్యాహ్న భోజన నిర్వాహకులే విజేతలుగా నిలవడం గమనార్హం. అప్పటి మంత్రిగా పనిచేసిన బొజ్జల గోపాలకృష్ణారెడ్డి చొరవతో ఎండిఎం బాధ్యతలు చేపట్టిన మహిళా సంఘం రుచి, నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా విద్యార్థులకు భోజనం అందిస్తోంది. రాష్ట్రస్థాయి విజేతలుగా నిలిచిన ఎండిఎం నిర్వాహకులను ఏఎంపుత్తూరు మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురప్ప అభినందించారు.

యోగాంధ్రను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ప్రతి ఒక్కరూ యోగా చేసి సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని శ్రీకాళహస్తి డిఎస్పి నరసింహమూర్తి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీని డి.ఎస్.పి పచ్చజెండా ప్రారంభించారు. యోగ వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐలు గోపి, తిమ్మయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

విలేకరి మెహర్ హఠాన్మరణం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : వార్త దినపత్రిక తొట్టంబేడు మండల విలేకరి చిట్టత్తూరు మెహర్ కుమార్(45) శుక్రవారం హఠాన్మరణం చెందారు. ఆయన మృతి పట్ల శ్రీకాళహస్తి పాత్రికేయులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కొండమిట్టలోని ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. 26 ఏళ్లపాటు పాత్రికేయ ప్రస్థానంలో మెహర్ కుమార్ తనకంటూ ఓ ప్రత్యేకతను ఏర్పరుచుకున్నారు. మెహర్ అంత్యక్రియల్లో శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎం.వేణుగోపాల్, కార్యనిర్వాహక కార్యదర్శి ధనశేఖర్, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు : స్థానిక భాకరాపేటలో ఊరు పేరు లేని వ్యక్తి మృతి చెందడం జరిగిందని భాకరాపేట పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు సుమారు ఒకటిన్నర సంవత్సరంగా మృతుడు రాజు అనే పేరుతో భాకరాపేటలో ఉంటూ ఒక రూము అద్దెకు తీసుకుని మేస్త్రీ పనిచేసుకుంటూ జీవిస్తూ ఉండేవాడు. అతను తాగుడుకు బానిసై ఎప్పుడు మద్యం మత్తులో ఉండేవాడని స్థానికులు తెలిపారన్నారు. శుక్రవారం ఉదయం ఇతని రూములో చనిపోయి ఉండగా చుట్టుపక్కల వారు తమకు సమాచారం అందించారని, కాగా ఇతని ఊరు ఎవరికీ తెలియదన్నారు. వివరాలు ఎవరికైనా తెలిసినట్లయితే భాకరాపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ 9490617880 లేదా సబ్ ఇన్స్పెక్టర్ 9440900711 ఫోన్ నంబర్లకు సమాచారం తెలపాలని కోరారు.

కాలువలో గర్భస్థ శిశు మృతదేహాలు



కాలువలో శిశు మృత దేహాలు, స్థానికులను విచారిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు అశోక్ నగర్ ప్రాంతంలోని ఓ మురికి కాలువలో ఇద్దరు గర్భస్థ శిశు మృతదేహాలు ఉండటాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించారు. స్థానికుల వివరాలు మేరకు శిశువుల మృతదేహాలను బట్టి నెలల పూర్తిగా నిండక మునుపే పుట్టి మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. మరికొందరు ఎవరికైనా ఆబార్షన్ కావడంతో కవల పిల్లలు పుట్టి మృతిచెంది వుండవచ్చంటున్నారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి సమయంలో మురికి కాలువలో మృతిచెందిన శిశువుల దేహాలను తెచ్చి పడవేసి ఉండొచ్చని అభిప్రాయపడుతున్నారు. స్థానికులు ఈ విషయమై ఒకటో పట్టణ పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. ఈ మృతశిశు దేహాలను కాలువలో నుంచి బయటకు తీసి పూడ్చిపెట్టారు. పోలీసులు ఈ సంఘటనపై విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

ముద్దాయి శ్రీనివాసులు అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట మండలం, వేముగుంట పాలెం పంచాయతీ, మడపలం కాలవగట్టు గ్రామంలో ఇటీవల భార్యను హతమార్చి తప్పించుకు తిరుగుతున్న కేసులో భర్తను నాయుడుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం నాయుడుపేట సిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అర్బన్ సీఐ బాబి వివరాలు తెలియజేశారు. ఈనెల 17వ తేదీన మద్యం సేవించి భార్య భర్తలు ఇద్దరూ గొడవపడిన సంఘటనలో భర్త రాయితో దాడి చేయడంతో భార్య మృతి చెందినట్లు తెలిపారు. భార్య కృష్ణవేణిని హత్య చేసిన భర్త మానికల శ్రీనివాసులును నాయుడుపేట పట్టణ సమీపంలోని మల్లాం కూడలి వద్ద పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా హత్య కేసును ఛేదించడంలో ప్రతిభ కనపరిచిన ఎస్ఐ ఆదిలక్ష్మి, కానిస్టేబుళ్లు దయాకర్, పోలయ్య, హోంగార్డ్ వెంకటేశ్వర్లను సిఐ అభినందించారు.

భాకరాపేట ఘాట్ రోడ్డులో ప్రమాదం

ప్రజాశక్తి - రామచంద్రాపురం(చంద్రగిరి): చంద్రగిరి మండలం, భాకరాపేట ఘాట్ రోడ్లో శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. బెంగుళూరు నుంచి తిరుపతికి వస్తున్న భారతి మోటార్ సర్వీస్ బస్సు, తిరుపతి నుంచి పీలేరు వైపుకు వెళతున్న కారు ఢీ కొన్న ఘటనలో కారు డ్రైవర్‌కి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమయింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

పడితే.. పడండి.. మాకేంటి..!

■ పైప్ లైన్ ఏర్పాటులో గుత్తేదారు నిర్లక్ష్యం.. ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రత్యేక ప్రతిభావంతులు

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి): బీడీ కాలనీకి పైప్ లైన్ ఏర్పాటు ఆలస్యమవుతుండటంతో కాలనీవాసులు, దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారు. అభివృద్ధి పనుల పేరుతో స్థానిక లైబ్రరీ నుండి బీడీ కాలనీ వరకు తాగునీటి సౌకర్యార్థం పైపులైన్ ఏర్పాటు హర్షించదగ్గ విషయమే. ఈ పనుల కోసం ప్రభుత్వం 12.50 లక్షల రూపాయలు కేటాయించింది. ఇంతవరకు బాగానే ఉన్నా పనులు మొదలు పెట్టిన నెల రోజుల నుండి ఉన్న సిమెంట్ రోడ్డు పగలగొట్టి, రోడ్డు మధ్యలో గొయ్యి తీసి, పైపులు బిగించి నప్పటికీ, గొయ్యిని పూడ్చకనే జెసిబితో పనులు చేయించడంతో మధ్యలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఆ గోతులతో వాహనదారుల ఇబ్బందులు వర్ణనాతీతం. దివ్యాంగులు ఈ దారి గుండా మూడుచక్రాల వాహనాల్లో ఇల్లు చేరడానికి చాలా ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. అధికారపార్టీకి చెందిన గుత్తేదారు నిర్వాకంతో ఎప్పటికి పనులు పూర్తవుతాయో తెలియని పరిస్థితి.

చంద్రగిరి నడిరోడ్డులో లైబ్రరీ వద్ద పైపు లైన్ మర్మత్తు కోసం గుంతను తవ్వారు గుంతలను తవ్వి నెల రోజుల గడుస్తున్నా తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

కనీసం సూచిక బోర్డులను సైతం ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు గాయాల పాలవుతున్నారు. టవర్ క్లాక్ సమీపంలో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే దారిలో వున్న ఇనుప గ్రిల్ పడిపోవడంతో రోగులు ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గేటు పేరుతో వసూలు చేయడంలో చూపుతున్న శ్రద్ధ పంచాయతీ అధికారులు సంతకు వెళ్లే దారిలో గ్రిల్‌ను బాగు చేయాలనే ఆలోచన లేకపోవటంతో చంద్రగిరి ప్రజల దురదృష్టకరం. ఇప్పటికైనా అధికారులు, స్పందించి రోడ్డు పై ఉన్న గుంతల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. బీడీ కాలనీకి పైపులైను నిర్మాణం ఆలస్యం అవుతున్న మాట నిజమేనని కూలీల కొరత కారణంగా ఆలస్యం అవుతున్నదని ఏఈ రవికుమార్ వివరణ ఇవ్వటం సహేతుకంగా లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. స్థానిక శాసనసభ్యులు చొరవ తీసుకుని పనులు పూర్తయ్యేలా అధికారులు, గుత్తేదారును ఆదేశించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.